


మా పెళ్ళి అయాక మొదటి ఎనిమిది సంవత్సరాలూ పూణెలోనే వున్నాం. వున్నామంటే వూరికే వున్నట్లు కాదు. అది నాకు ఎనిమిది సంవత్సరాల ట్రైనింగ్ పీరియడ్, పైగా ఇంట్లోనూ, లాబ్‌లోనూ కూడా చాలా కఠినమైన ప్రమాణాలు. నా చిన్నప్పటి నుంచీ పెద్దగా అదుపాజ్ఞల్లో పెరిగినదాన్ని కాదు. నాకు తోచినట్లుగా వుండేదాన్ని. మరీ శృతిమించితే మా అమ్మ అదిలించేదికానీ నేనెప్పుడూ పట్టించుకునేదాన్ని కాదు. కానీ ఇక్కడ మన ఇంట్లో అలా కుదరదే! అందులో వెనకేసుకొచ్చేందుకు మొదటి రెండు సంవత్సరాలూ అత్తగారు కూడా పక్కన లేరు.

ఎందుకంటే మేము ఇంకొక జంటతో ఎవరికో ఎలాటైన క్వార్టర్ని షేర్ చేసుకునేవాళ్ళం. డ్రాయింగ్, డైనింగ్, బెడ్ రూం, కిచెన్ అన్నీ ఆ 12 x 12 గదే! అదేం పెద్ద సమస్యగా అనిపించేది కాదు గానీ శనాదివారాలొస్తే మా ఆయనతో ఛెస్సాడటానికి ఎవరో ఒకరు పొద్దున్న ఎనిమిది నుంచీ సాయంత్రం ఏడు వరకూ రెండేసి గంటలకొకరు చొప్పున కూచుని వుండేవారు. నేను ఆ ఇంటి బయట మెట్లమీద కూచుని కాలం గడపవలసి వచ్చేది. అది కూడా నాకు సమస్యగా అనిపించేది కాదు. కానీ ఈయనకి కోపం ఎప్పుడొస్తుందో, ఎందుకొస్తుందో తెలిసేది కాదు. నన్నేమీ అనేవారు కాదు గానీ రెండుమూడు రోజులు మాట్లాడేవారు కాదు. పుట్టింట్లో నవ్వుకుంటూ, కొట్టుకుంటూ, తిట్టుకుంటూ ఆడుకుంటూ, పాడుకుంటూ ముగ్గురు చెల్లెళ్ళూ, తమ్ముడూ అమ్మానాన్నలతో గోలగోలగా బతికిన నాలాటి దానికి అంతకన్నా నరకమేముంటుంది చెప్పండి?

ఇంక లాబ్‌కి వెడితే మా గైడు నేను కనిపిస్తే చాలు పనిచెప్పేవారు. అందులో సగంపైగా పనికిరానివే! చచ్చీచెడీ చేసినా ఆ కాంపౌండ్సు రియాక్టవవు. ఏమీ వుపయోగం వుండదు. ఆ విషయం ఆయనకీ తెలుసు, నాకూ తెలుసు. నాకన్నా ముందు ఆయన దగ్గర పనిచేసిన స్టూడెంట్సందరికీ తెలుసు. మరెందుకయ్యా అంటే అదంతే. కొత్తగా చేరిన స్టూడెంట్సుకిచ్చే ట్రైనింగన్నమాట. ఆయన ఒక నిమిషం చెప్పేస్తే మనం నెల్లాళ్ళపాటు అదే చేసుకుంటూ వుండిపోతాం గదా! పైగా ఎక్కడ రిజల్ట్సు అడుగుతారోనని మనమే తప్పించుకు తిరుగుతాం కూడా! అదీ ఈ ట్రైనింగ్ రహస్యం.

మా రిసెర్చి గైడు మనదేశంలోనే చాలా పేరు ప్రఖ్యాతులున్న సైంటిస్టు. తన దగ్గర నాలాగా డాక్టరేటు కోసం పనిచేసే స్టూడెంట్లు పదిపన్నెండుమంది వుండేవారు. వారిలో ఏకైక నారీరత్నాన్ని నేనే. మేం కాకుండా ఆయనకి తన ప్రాజెక్టులో పనిచేసే స్టాఫ్ ఒక ఇరవైమంది వుండేవారు. బాస్ వూళ్ళోలేనప్పుడు స్టూడెంట్సందర్నీ ఏ సినిమాకో లాక్కుపోగల సత్తా వున్నదాన్ని నేనొక్కదాన్నే అని కూడా ఆయనకి తెలుసు. అబ్బాయిలంతా ఏవిటో ఎప్పుడూ భయంభయంగా సార్ సార్ అంటూ వినయం నటించేవారు. అయినా ఆయన ఎవరినీ నమ్మేవారు కాదు తన పి.ఏ. కులకర్ణిని తప్ప. తన పనులమీద మూడు నాలుగు రోజులు ఏ ఢిల్లీయో వెళ్ళినపుడు మా మీద ఒక కన్నేసివుంచమని ఆ కులకర్ణికి చెప్పేవారనుకుంటా. వాడు గంటకోసారి మా రూమ్‌లలోకి వచ్చి ఏదో వాగి వాగి పోతుండేవాడు. లాబ్‌లోని అన్నివిశేషాలు డైరీలో ఎక్కించుకుని ఆయన రాగానే చేరేసేవాడు.

కానీ మేం రీసెర్చి స్టూడెంట్లం కదా! ఉపాయాలు కనిపెట్టలేమా! మేము రెండుజట్లుగా విడిపోయి ఒకజట్టు వాడికి కనబడేలా ఏదో పనిచేస్తుంటే రెండో జట్టు సినిమాకో షికారుకో వెళ్ళిపోయేవాళ్ళం. ఫ్రెండ్సుని మా ఇంటికి తీసికెళ్ళి మసాలా దోసెలూ, పెద్ద పెద్ద జీడిపప్పులేసిన సేమ్యా పాయసమూ లాంటివి చేసిపెట్టేదాన్ని. అందరం అవి తింటూ హాయిగా మా గైడు గారి గురించి మాట్లాడుకునేవాళ్ళం. మళ్ళీ మళ్ళీ ఆయనకి ఢిల్లీలో పనిపడాలని సామూహిక ప్రార్థనలు చేసేవాళ్ళం. అసలు జీవితంలో అన్నిటికన్నా పెద్ద శుభోదయం ఏవిటంటే లాబ్‌కెళ్ళగానే గైడుగారు వూళ్ళోలేరని తెలియడం.

అప్పటి నా మిత్రులలో పాటిల్, సాఠే, దేశ్‌పాండే, నాయక్, దేశముఖ్‌లు చాలా ముఖ్యులు. వీళ్ళు కాకుండా మా ఆయనకి ఛెస్సుబృందం, బ్రిడ్జ్ బృందం, తెలుగు బృందం ఇలా రకరకాల మిత్రులతో క్షణం తీరుబడి వుండేదికాదు.

ఇలా అటూ ఇటూ తిరుగుతూ పనిచేస్తున్నట్లు చెయ్యనట్లు నటిస్తూ వుండగానే, మా ఆయనకి డిగ్రీ, దానితోపాటు రెండు ప్రమోషన్లు, ఆ పైన హాస్టల్లో మంచి రెండు పడగ్గదుల సూట్ కూడా దొరికాయి. అంటే అప్పటికి మేము గృహస్థులమయినట్లు. ఇల్లు దొరకగానే మా అత్తగారు అవనిగడ్డకి టాటా చెప్పేసి వచ్చారు. ఆవిడ రాకతో మా ఇల్లొకదారిన పడింది. నా రిసెర్చి పని కూడా గాడిలో పడి వేగం పుంజుకుంది. ఇల్లు దొరకగానే ఏడాదేడాది తేడాతో పిల్లలు కూడా పుట్టేశారు. నన్నే ఇబ్బందులూ పెట్టని వాళ్ళెవరయ్యా అంటే పుట్టకముందూ, పుట్టాక కూడా నా పిల్లలే! అంత బుద్ధిమంతులు. పొలాల్లో నాట్లేసే మహిళా రైతుల్లాగా నేను డెలివరీకి ఒక రోజు ముందుకూడా లాబ్‌లో పన్నెండుగంటలూ పనిచేసాను. మళ్ళీ పన్నెండో రోజు నుంచీ లాబ్‌కెళ్ళాను. ప్రభుత్వం వాళ్ళు మూడ్నెల్లు సెలవు ఇచ్చి "వాడుకో అమ్మా" అన్నా ఇంట్లో ఈయనా ఒప్పుకోరు! లాబ్‌లో గైడు ఒప్పుకోరు ... ఇద్దరిదీ ఒకటే కామెంటు – "చూడ్డానికి బాగానే వున్నావు కదా! ఇంట్లో కూచుని ఏం చేస్తావ్?" అని. మా అబ్బాయి పుట్టినపుడు మాత్రం అమ్మ దగ్గిరకెళ్ళాను కాబట్టి ఒకవారం ముందువెళ్ళి వాడు పుట్టిన పదిహేనవ రోజుకి తిరిగి వచ్చి జాయినయ్యాను. మా గైడెంత గొప్పవాడంటే ఆ నెల రోజులకీ సరిపడా హోమ్ వర్క్ ఇచ్చాడు అక్కడ అమ్మగారింట్లో పనేముంటుందని చెప్పి! ఇంకా విచిత్రం ఆయనకి నేను డెలివరీకెడుతున్నానని కూడా తెలియదుట! వూరికే అమ్మని చూడ్డానికెడుతున్నాననుకుని నెల్లాళ్ళ సెలవెందుకని గంటసేపు వాదించాడు. ఏం చెప్పాలి! సైంటిస్టుల బుర్రలంతే! కళ్ళు తెరిచే వుంటాయి కానీ ఏవీ కనపడవు. ఇంకా గొప్ప విషయం అప్పుడు నా

ఫెలోషిప్ మూడేళ్ళు అయిపోయింది. నాకే జీతమూ బత్తెమూలేదు. వృత్తగానే చేసే చాకిరీకి ఇన్ని ఆంక్షలు. ఈ కష్టాలు బయటివాళ్ళకి అర్థంకావు. రిసెర్చిలో వున్న ఆడవాళ్ళకర్థం అవుతుంది. కానీ ఇప్పుడు ఆడపిల్లలు అంత వాజమ్మలలాగా లేరు. వాళ్ళకి తమరి విలువా తెలుసు, హక్కులూ తెలుసు. మాతృత్వపు విలువ కూడా తెలుసు.

నా డిగ్రీ వర్కు చివరి దశలో వుండబట్టి తరచు రాత్రి పదిన్నర దాకా పని వుండేది. మా బాబు పగలంతా అత్తగారి దగ్గర హాయిగా వుండేవాడు. కానీ మగపిల్లాడు కదా! వాడుకూడా కొన్ని రూల్సు పెట్టాడు. నేను సాయంత్రం పెందరాళే ఇంటికి రాకపోతే, నేను వచ్చేవరకూ ఒక నిద్రతీసి ఫ్రెష్‌గా లేచి నా గొంతు వినగానే పెద్దగా ఏడుపు మొదలుపెట్టేవాడు. కళ్ళమ్మట చుక్కనీరుండేది కాదు. కానీ ఒకటే అరుపులు. అప్పుడు వాణ్ణి ఎత్తుకుని ఇంట్లోనూ, వరండాలోనూ, గార్డెన్లోనూ పరిగెత్తాలి. అలా ఒక అరగంట పరుగులు పెడితే అపుడు చంద్రోదయంలాంటి చిన్నవ్వునవ్వి మళ్ళీ నిద్రబోయేవాడు. ఇవన్నీ అయ్యేటప్పటికి రాత్రి పన్నెండయేది. మళ్ళీ పొద్దున్నే ఆరుగంటలకి లాబ్‌కెళ్ళి ఫర్నెస్ ఆపి ఇంటికొచ్చి పడుకునేవాళ్ళం. మాలాబ్‌కి హాస్టల్‌కి మధ్య కిలోమీటరున్నర దూరం. రోజుకి రెండుసార్లు అప్పుడప్పుడు మూడుసార్లు రాకపోకలతో రోజుకి ఏడెనిమిది కిలోమీటర్ల నడకవుండేది. మనిషిని సన్నగా చురుగ్గా వుండేదాన్ని.

మా గ్రూప్‌లో లేడీ రిసెర్చి స్కాలర్లెవరూ లేరుగానీ రెగ్యులర్ స్టాఫ్‌లో ఇద్దరు ముగ్గురు అమ్మాయిలు లాబ్ అసిస్టెంట్లుగా పనిచేసేవారు. అందులో సింధు అనే అమ్మాయి నాకు మంచి స్నేహితురాలైంది. నా ఈడుదేకానీ తనకి అప్పటికి పెళ్ళికాలేదు. తండ్రిలేరు. వాళ్ళ అమ్మా, చిన్న తమ్ముడూ తనూ పాతపూణేలో ఒక చిన్న ఇంట్లో వుండేవారు. తన సంపాదనే వాళ్ళకి ఆధారం. అందువల్ల తమ్ముడు గ్రాడ్యుయేట్ అయ్యాకే తన పెళ్ళి అని చెప్పి వాయిదావేసుకుంది. చివరికి వాడు గ్రాడ్యుయేట్ అయ్యాక తనకి పెళ్ళి కుదిరింది. మంచి గవర్నమెంటు ఉద్యోగంలో ఉన్న ఆడపిల్లకి కాస్త వయసు వచ్చినా పెళ్ళి అవడం అంత కష్టం కాదు. అప్పుడయినా ఇప్పుడయినా! అక్కడయినా! ఇక్కడయినా! వాళ్ళది చాలా సాంప్రదాయ వైష్ణవ కుటుంబం. నెలలో పదిరోజులు ఏవో పేరుచెప్పి వుపవాసాలు చేస్తుండేది. చాలా నిదానంగా, నిశ్శబ్దంగా పని చేసేది.

మహరాష్ట్రులు అందులో బ్రాహ్మలు చాలా పొదుపరులు. నిరాడంబరంగా జీవించగలరు. ఒక్క సింధుయే కాదు. నేను చాలా కుటుంబాలు చూసాను. ఏ

పనైనా, పెళ్లైనా పేరంటమైనా పద్ధతిగా చేస్తారు. మాటవరసకి ఇంట్లో ఏదైనా పూజవుందనుకోండి -- అలంకారానికీ, పూజకీ రెండుగంటల సమయం కేటాయిస్తే, నైవేద్యం వండడానికి పావుగంట కేటాయిస్తారు. మనం నైవేద్యం చేయడానికి నాలుగుగంటలు, పూజపావుగంట. ఎప్పుడయిపోతుందా అన్న తొందరేగా!

ఒక చిన్న గది, ఇంకా చిన్న వంటగది వున్న ఇంట్లో అయిదారుగురున్న కుటుంబం హాయిగా కాలం గడిపేస్తుంది. తక్కువ జాగాలో జీవించవలసి వుండడంతో ఇల్లంతా పరిశుభ్రంగా వుంచుకోవడం, బట్టలు లాంటివి ఎప్పటికప్పుడు వుతికి మడతలు పెట్టుకోవడం, ఆహార పదార్థాలు వృథాకాకుండా తగుమాత్రంగా చేసుకోవడం లాంటి మంచి లక్షణాలు ఎన్నో వుంటాయి. వాళ్ళు బట్టలు కూడా ఎంతవరకూ అవసరమో అంతవరకే కొనుక్కుంటారు. ఏదీ వృథా ఖర్చులు చేయరు. ఎవరికయినా మంచినీళ్ళిచ్చేటప్పుడు చూస్తే వాళ్ళ పద్ధతులన్నీ అర్థమవుతాయి. ఒక చెంబులో నీళ్ళుపోసి పైన చిన్న కప్పులాంటి దాన్ని మూతపెట్టి ఇస్తారు. ఎన్నికావాలంటే అన్నే పోసుకుని తాగచ్చు. మనలాగా గ్లాసునిండా నీళ్ళిస్తే తాగినన్ని తాగి మిగతావి పారబోయడం కాదు. అసలు చాలా చిన్న విషయాలలోనే పెద్ద సూత్రాలు దాగి వుంటాయి. అలాగే కాఫీ, టీ కప్పులు కూడా చిన్నవిగానే వుంటాయి. నే చెప్పేదంతా మధ్యతరగతి కుటుంబాల గురించి సుమా! ఎక్కువమందిమి ఆ వర్గానికి చెందినవాళ్ళమేగా.

ఇంక భోజనాలదగ్గరయితే కొంచెంకొంచెంగా ఎన్నిసార్లయినా వడ్డిస్తారు గానీ ఎక్కువ మాత్రం వేయరు. నేను ఒకసారి అడిగాను "ఎందుకన్నిసార్లు తిరుగుతారు? అంత కొంచెం వడ్డిస్తారు?" అని. అప్పుడావిడ చెప్పింది ,పూర్వకాలం కోడళ్ళు వడ్డిస్తుంటే అత్తగార్లు కుర్చీపీట మీద కూచుని అజమాయిషీ చేసేవారుట. కొంచెం ఎక్కువ వడ్డిస్తే 'నీకు బద్ధకం ఎక్కువ! తిరగడం తగ్గుతుందని ఒకేసారి బోలెడు వేస్తావు. వాళ్ళేం అనుకుంటారు?" అని కోప్పడేవాళ్ళుట. అందుకని రోటీని కూడా నాలుగు ముక్కలు చేసి వడ్డిస్తారు. తెలుగువాళ్ళకి తప్పుగా తోస్తుంది కూడా. నాకయితే చాలా ఆశ్చర్యంగా వుండేది. వాళ్ళకీ నన్ను చూస్తే అలాగే వుండేది.

మా లాబ్‌లో పనిచేసే అమ్మాయిలు చాలామంది ఒక జట్టుగా బయల్దేరి వెళ్ళి ప్రతి పౌర్ణమికీ ఒక గ్రాము బంగారం కొనుక్కునేవారు. ఏడాది తిరిగేటప్పటికి తులం అయేది. అలా నాలుగేళ్ళు పనిచేస్తే తమకి కావల్సిన మినిమమ్ బంగారాన్ని తామే కొనుక్కునేవారు. ఇంకా ఎవరి వస్తువులు వాళ్ళవే అన్న పద్ధతులు కూడా చూశాను. ఒకసారి ఇంకో స్నేహితురాలింటికి వెళ్ళినపుడు తన రూంలో టేబుల్ ఫాను, రేడియో,

పట్టెమంచం, బీరువా ఉన్నాయి. మిగతా ఇంట్లో రెండు చాపలు తప్ప ఏమీ లేవు. వాళ్ళ నాన్నగారు కూడా చాపమీద పడుకోవడం చూశాను. తన రూంకి తాళం వేసుకుని వచ్చేది. అదేమిటీ అని అడిగితే ఇవన్నీ నా కష్టార్జితంతో కొనుక్కున్నాను. నా పెళ్ళయ్యాక మా ఇంటికి తీసుకుపోతాను అని చెప్పింది.

మా సింధు ప్రతి గురువారం తప్పక వుపవాసం వుండేది. ఇంకా ఏకాదశులూ, ఏవేవో పర్వదినాలు అన్నీ వుపవాసమే. అలాటపుడు నాకు పండగే. ఎందుకంటే వుపవాసం నాడు వాళ్ళు సగ్గుబియ్యంతో చేసిన కిచిడీ తింటారు. సింధు వాళ్ళ అమ్మగారు నాకోసం వేరే చిన్న డబ్బాలో పెట్టి పంపేవారు. అలాగే థాలీపీట్ కూడా! మన దిబ్బరొట్టె, పిండిపులిహోర లాగా శుద్ధ నాటు వంటలు. కానీ అవి తినకుండా ఎవరూ పెరిగి పెద్దవరు. తను నాకోసం డబ్బా తెచ్చినపుడు దాన్ని నా టేబిల్ మీద పెట్టుకుని అటొచ్చి ఇటొచ్చి తిరుగుతూ రోజంతా కొంచెం కొంచెం నోట్లో వేసుకునేదాన్ని. భోజనం మాత్రం లేడీస్ గ్రూపులో తినడం కుదిరేది కాదు. ఎందుకంటే మా అత్తగారు మా ఇద్దరికోసం పన్నెండింటికి వండి హాస్టల్ పనివాడితో వేడివేడి కారియర్ పంపేవారు. ఆ కారియరు చూసి మాకన్నా చాలా సీనియర్లు కూడా కుళ్ళుకునేవారు. వాళ్ళ డబ్బాలు పాపం ఏ తెల్లారగట్లో వండినవి కదా! అలా ఎవరికీ లేని రాజభోగాలు అనుభవించాం. అమ్మ అనే వస్తువుంటే అంతేమరి!

మా లాబ్‌లో బ్రహ్మాండమయిన కాంటీన్‌వుండేది. బ్రేక్‌ఫాస్ట్ 20 పైసలు, భోజనం అరవైపైసలో ఎంతో! ఇంచుమించు త్రీస్టార్ హొటల్ వాళ్ళ థాలీ లాగా వుండేది. అంతా సబ్సిడైజడ్! నాకు ఆ భోజనం చేయాలని మనసేసినపుడు అత్తయ్యగారిని వాళ్ళబ్బాయికొక్కరికే భోజనం పంపమని నా ఫ్రెండ్సులో ఎవరికయితే లంచ్ బాకీపడ్డానో వాళ్ళతో వెళ్ళి భోజనం చేసేదాన్ని. నాకు రకరకాల రుచులిష్టం. మా ఆయనకి ఒకటేరకం. ఒకటేటైము. ఒకటే పరిమాణం. ఈయనకి కృష్ణాజిల్లా అవనిగడ్డలో వాళ్ళ అమ్మగారు ఏవంట ఎలా చేసారో అలాగ చేసి పెడితేనే తింటారు. ఇంకోలా చేస్తే ఏదో కుదరలేదని లేచేస్తారు. పండగలొస్తే ఇంట్లోవాళ్ళం సెలిబ్రేట్ చేసుకోవలసిందే! తనకేమీ తేడా పడదు. అంత నియమంగా పూర్వకాలంలో ఋషులు కూడా వుండేవారు కాదని నా నమ్మకం. నేనయితే పూణెలో మరాఠీ భోజనం, తమిళనాడులో సాంబార్‌సాదం, పంజాబ్‌లో ఆలూపరాఠా, అమెరికాలో పిజ్జా... అదికూడా పిల్లలు తినే డబుల్ ఛీజ్! ఏమయింది? శుబ్భరంగా వున్నాను. ఎప్పుడో ఏ అమెరికా వాడో ఎటూ కనిపెడతాడు పాలు, వెన్నా, ఛీజూ తింటేనే వంటికి మంచిదని! అవకాశం దొరకాలేగానీ ప్రపంచం అంతా మనదే!

నేను పూణె వెళ్ళడమే పెళ్ళి చేసుకున్నాక వెళ్ళాను గానీ అక్కడ మా లాబ్‌లో పనిచేసే స్టూడెంట్లకి గానీ, స్టాఫ్‌కిగానీ పెళ్ళిళ్ళవుతునే వుండేవి. కొద్దిమందిని ముహూర్తం చూసి, భోజనం చెయ్యడానికీ, మిగిలిన వాళ్ళని రిసెప్షనుకీ పిలుస్తూ వుండేవారు. అలాటి రిసెప్షనుకొకదానికి నేరక నా కూతుర్ని తీసుకువెళ్ళాను. అది మూడేళ్ళ పిల్ల. వాళ్ళు కొంచెం చివడా, ఒక పేఢా, టీ ఇచ్చారు. అవేవీ దానికి నచ్చలేదు. ఇంక దానికి కోపం వచ్చి 'ఒక గులాబీ జామకాయా లేదు, ఫ్రూట్‌సెల్లా లేదు ఎందుకు పిల్చావ్' అని తిన్నగా పెళ్ళికొడుకునే అడిగి నా పరువు తీసింది. దాని దృష్టిలో ఫ్రూట్‌సెలాడుంటేనే పార్టీ. నా ఫ్రెండు సింధుకి పెళ్ళి కుదిరిందికదా. వాళ్ళు మగపెళ్ళివారికి ఆరువేలు కాష్ ఇచ్చారు. పెళ్ళి ఏర్పాట్లు, ఖర్చులు అన్నీ వాళ్ళే చూసుకునేటట్టు. ఇక్కడ సింధుకి వెనక ఎవరూ లేరుకదా! పెళ్ళివారు ఆడపిల్ల తరఫున పెళ్ళికూతురు, కన్యాదాతలతో సహా ముప్పైమందికి భోజనాల పర్మిషన్ ఇచ్చారు. మొన్న చాలా ఏళ్ళ తర్వాత పూణె నుంచి వచ్చిన ఒక ఫ్రెండుతో "మీ మహారాష్ట్ర వాళ్ళు పెళ్ళిళ్ళు చాలా చక్కగా నిరాడంబరంగా చేస్తారు. ఇక్కడ వేలకివేల మందిని పిలిచి జాతరలాగా చేసి డబ్బు వృథా చేస్తారన్నా". దానికి అవిడ "ఇప్పుడు మా పూణె కూడా అలాగే అయిపోయింది. అన్నీ వృథా ఖర్చులే. ఎట్నించి ఎటు పోతున్నామో తెలియట్లేదు" అని బాధపడింది.

నాకు పూణెతో వున్న అనుబంధం నలభై ఏళ్ళనాటిది. ఆ రోజుల్లో పెళ్ళిళ్ళు ఎలా చేసేవారో చెప్తాను. సాధారణంగా పెళ్ళి ముహూర్తాలు ఉదయం తొమ్మిది పది మధ్య వుండేవి. దగ్గర బంధువులు మాత్రమే అంటే సుమారు ఇరుపక్షాలా కలిపి వందమంది లోపు పెళ్ళికీ, పెళ్ళి విందుకీ ఆహ్వానితులు. మిగతావారంతా సాయంత్రం సింపుల్ రిసెప్షనుకి వచ్చేవారు. నేను సింధు పెళ్ళిలో ఇంచుమించు అక్క రోల్ పోషించాను కాబట్టి నన్ను కూడా పెళ్ళికి రమ్మని పిలిచారు. వాళ్ళ అమ్మగారు వినాయకుడి పూజ, పసుపుదంచడం అన్నిటికీ నన్ను పిలిచారు. నేను ఒకసారి సాంగ్లిలో మా ఫ్రెండు పాటిల్ చెల్లెలు పెళ్ళికి వెళ్ళాను. వాళ్ళు పెళ్ళకూతుర్ని చెయ్యడం నాకు బాగా గుర్తుండిపోయింది. ఆ సమయంలో వాళ్ళు అయిదుగురు ముత్తయిదువులకి సువాసినీ పూజ చేస్తారు. ఆ పూజ అందుకునే ఆవిడకి తల్లీ తండ్రీ, అత్తామామ, తోడబుట్టినవాడు, ఒక కొడుకు వుండాలి. అలాటి ఐదుగురు స్త్రీలకి తలంటు పోసి కొత్త చీరలు కట్టించి అలంకారాలు చేసి ముగ్గులలో వుంచిన కంచాలముందు కూర్చోపెట్టి కొత్తగా పండిన జొన్నల పాయసం వడ్డిస్తారు. పెళ్ళి కూతురు తల్లి అందరి పాదాలకి నమస్కారం చేస్తుంది. ఒక్క నిమిషం నిజంగా దేవతలొచ్చారా! అన్న భ్రాంతి కలుగుతుంది. పాపం సింధు వాళ్ళు అంత హడావిడి

చెయ్యలేదులే! వాళ్ళ దూరపు బంధువులెవరో కన్యాదానం చేశారు. ఆ నగరంలో అందరికీ చిన్న ఇళ్ళు లేదా ప్లాట్లు మాత్రమే వుండేవి కాబట్టి అన్ని పెళ్ళిళ్ళు మంగళకార్యాలయాల్లోనే జరిగేవి. వాటినే మనం ఇక్కడ ఫంక్షన్ హాల్సంటాం.

సింధు పెళ్ళి ముహూర్తం కూడా ఉదయం తొమ్మిదిన్నరకే. మనం పెళ్ళికొడుక్కి పెళ్ళికూతురికి బాసికాలు కట్టినట్లు వాళ్ళు ముత్యాలసరాలు నుదుటికి కడతారు. దానిని మండావళి అంటారు. అది కట్టగానే పెళ్ళికళ వచ్చేసిందని సంబరపడతారు. కన్యాదానం చేయబోయే తల్లి కచ్ఛాపోసి పట్టుచీర కట్టుకుని, సిగలో అర్థచంద్రాకారపు పూదండ సింగారించి, ముక్కుకి ముక్కెర ధరించి మహాలక్ష్మిలా సింగారించుకుంటుంది. రోజూ జీన్స్‌పాంట్లలో తిరిగే అమ్మాయిలు కూడా పెళ్ళికెళ్ళాలనేటప్పటికి సంప్రదాయం అంతా వాళ్ళల్లోనే వుందనేట్లు ముస్తాబవుతారు.

ఇంక పెళ్ళి తంతు మనకి, వాళ్ళకి అన్నీ ఒకేలాగా వుంటాయి. కానీ శుభము హూర్తానికి మాత్రం పదినిమిషాలు ముందునుంచీ ఒకళ్ళనొకళ్ళు పిలుచుకుంటూ అందరూ వధూవరుల చుట్టూ అక్షతలు పుచ్చుకు నిలబడతారు. వధూవరులు చేతిలో పూలదండలతో నిలబడివుంటారు. మధ్యలో తెర వుంటుంది. ఇంక పురోహితులు గొంతెత్తి చక్కగా రాగాలాపన చేస్తూ మంగళాష్టకం చదువుతారు. ఆ అష్టకంలో వినాయకుడితో మొదలుపెట్టి సకల దేవతలనూ, గంగతో మొదలుపెట్టి అన్ని నదులనూ ఆహ్వానిస్తారు. సీతారాములను, లక్ష్మీ నారాయణులను, పార్వతీ పరమేశ్వరులను, తారామతీ హరిశ్చంద్రులనూ, రోహిణీ చంద్రులనూ, రుక్మిణీ కృష్ణులనూ ఇలా అనేక జంటలను స్మరిస్తారు. ఒక్కొక్క చరణం అవగానే వధూవరయో శుభం భవతు అని ఆశీర్వదిస్తూ శుభమంగళం అనగానే అందరూ సావధానా అని గొంతు కలుపుతూ వధూవరులమీద అక్షతలు జల్లుతారు. ఆ సన్నివేశం కన్నుల పండుగగా వుంటుంది. ఒక్క శ్లోకం చెప్తాను ఆ అష్టకంలోది వినండి.

గోత్రే భిన్న పరస్పరాహునతచీ విభిన్న జ్యాంచీకుళే

జీవే ఏకచి హెూతితీ వరవధూ ఆజన్మ జ్యాంచా ముళే

తేఏఈచక్రుపే ధరూని సదనీ మాంగల్య వైవాహికా

దాంపత్య స్థిర నిత్య శంకరకృపే కుర్యాత్ సదా మంగళం

శుభమంగళ సావధానా అని మూడుసార్లు అనగానే మంగళ వాద్యాలు మోగుతాయి. తెరతొలగుతుంది. వధూవరులు దండలు మార్చుకుంటారు. శు భముహూర్తం అయ్యాక కన్యాదానం, సప్తపది, లాజహెూమం లాంటివన్నీ వుంటాయి.

దాంతో పెళ్ళి అయినట్లు.

మహారాష్ట్రలో పెళ్ళి అయేటప్పటికి ఆడపిల్లకి ఇంటిపేరుతోబాటు తన అసలు పేరు కూడా మారిపోతుంది. ఇప్పుడలా ఆడపిల్లలు ఒప్పుకుంటున్నారో లేదో తెలియదు. ఎలా చేసేవారంటే ఇపుడు మాటవరసకి శంకర్రావు దేశపాండే గారమ్మాయి లక్ష్మి అంటే లక్ష్మీ శంకర దేశపాండే అనే అమ్మాయి విలాస్‌రావ్ భావేగారి అబ్బాయి గోపాల్ పెళ్ళాడితే ఆ పెళ్ళి కూతురి పేరు రుక్మిణి గోపాల్ భావే అయిపోతుంది. ఇంక చిన్నప్పటి ఫ్రెండ్సు ఆమెని వెతికి పట్టుకోవడం కష్టం. ఇలా పూర్తిగా పేరు మార్చడం అన్యాయం కదా అంటే మరి పార్వతి అనే స్త్రీకి విష్ణుమూర్తి అనే భర్త ఉండడం అపచారం కదా! అందువల్ల అమ్మాయి లక్ష్మి అవాల్సిందే అని వాదించేవారు. అందులో కూడా కొంత పాయింటుందనుకోండి! ఆ విధంగా నా స్నేహితురాలు సింధు దామోదర్ కానడే కాస్తా జ్యోత్స్న జయంత్ శ్రోత్రిగా మారిపోయింది.

గుమ్మందగ్గర వధూవరులు పేర్లు చెప్పడం మనలాగా 'నేనూ సుబ్బారావు వచ్చాం' అనో 'నేను లీలావతీ వచ్చాం' అని చప్పగా వుండదు. అవతలి వారి పేరుని ఏదైనా కవితలో దాచి చెప్పాలి. పెళ్ళికి ముందు ఆ కవిత తయారు చేయడానికి పాపం చాలా కష్టపడతారు. ఇప్పుడొక పెళ్ళికూతురి పేరు రాధిక అనుకుందాం. అపుడా పెళ్ళికొడుకు గిరిధర్ ఎలా చెప్పాలి?

కృష్ణుని వెతికిరి గొల్లెతలు యమునా తటిని పూలపొదలను.

చివరకు నవ్వుచు కనబడెను రాధిక కౌగిట గిరిధరుడు

అనగానే అందరూ చప్పట్లు కొట్టి భేష్ భేష్ అంటారు. కొన్ని పేర్లకు పద్యాలల్లడం కష్టం. కానీ అదొక ఆట.

భోజనాలకోసం చక్కగా ముగ్గులు పెట్టిన బల్లలు తయారుగా వుంటాయి. వధూవరులకి వెండికంచాలు కూడా మంగళ కార్యాలయ వాళ్ళే ఇస్తారు. మిగతా వాళ్ళందరికీ స్టీలు కంచాలు. అక్కడ అరిటాకులో భోజనాల పద్ధతి లేదు. మన పులిహోర బూరెలులాగా వాళ్ళకి మసాలా భాత్, జిలేబి ముఖ్యం. పూరీలు, రెండు కూరలు, పల్చటి పప్పు, రెండు సలాడ్‌లాంటి పచ్చళ్ళు, జిలేబీకి విరుగుడుగా సొంఠి మజ్జిగా అన్నీ కలిపి మంచి సమతుల్యమయిన పెళ్ళి విందు జరుగుతుంది. భోజనాలు మధ్యలో వుండగా వధూవరులు జిలేబి బుట్ట పట్టుకుని వచ్చి అందరికీ వడ్డిస్తారు. దీనితో శోభాయమానంగా పెళ్ళి సుసంపన్నమవుతుంది. ఈ వేడుకలన్నిటితోటీ మా సింధు పెళ్ళి జరిగింది.

అలా పూణెలో ఎన్నో పెళ్ళిళ్ళకి వెళ్ళాను. మన వూళ్ళో కూడా ఇలా మంగళ కార్యాలయాలు వుంటే బాగుంటుంది కదా! అన్నీ వాళ్ళే చూసుకుంటారు హాయిగా అనుకునేదాన్ని. ఇంక ఇప్పుడు కావాలన్నా ఇక్కడ మనకి ఇళ్ళల్లో పెళ్ళిళ్ళు కనిపించవు. పెద్ద పెద్ద ఇళ్ళున్నవాళ్ళు కూడా ఇల్లు పాడయిపోతుందని ఇంట్లో చెయ్యరు. ఎప్పుడయితే ఇంట్లో పెళ్ళిళ్ళు చెయ్యడం మానేశామో అప్పుడే ఆ పెళ్ళి సందడి, పనులు పంచుకోవడం వడ్డనలందుకోవడం అందరూ కబుర్లు చెప్పుకుంటూ ఒకే హాలులో నిద్దర్లు పోవడం అన్నీ పోయాయి. మగ పెళ్ళివారి మర్యాదలు చేసేది కూడా క్యాటరింగ్ వాడే కదా! ఇంకేం సరదా! ఏదో పిలవక పోతే బాగుండదని వాళ్ళు పిలుస్తారు. పిలిచాక వెళ్ళకపోతే బాగుండదని మనం వెళతాం. అంతే!

✤